వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 062
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
ఫిబ్రవరి 16, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



## అక్షర చిట్ ఫండ్ డైరెక్టర్ శ్రీవిద్య అరెస్ట్

- బెంగళూరు విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- జడ్జి ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలింపు







# హై టెన్షన్





- చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎంపికలో బాహాబాహి
- పరస్పర నినాదాలతో తొర్రూరు, జనగామలో ఉద్రిక్తత
- బీఆర్ఎస్ ఆధిక్యాన్ని దెబ్బతీసిన ఎక్స్ అఫీషియో సభ్యులు
- ఎర్రబెల్లిని అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు
- రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన ఎస్పీ శబరీష్
- జనగామ, తొర్రూరు, డోర్నకల్ లో రేపటికి వాయిదా

వివరాలు2లో..

రాష్ట్ర వ్యాప్తంగా మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నిక పక్రియ కొనసాగుతున్న వేళ పలుచోట్ల తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. స్పష్టమైన మెజారిటీ ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఎన్నిక సజావుగా సాగుతున్నప్పటికీ హంగ్ వచ్చిన పలు మున్సిపాలిటీల్లో మాత్రం పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఆయా మున్సిపాలిటీల్లో పాగా వేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఎత్తులకుపైఎత్తులు వేస్తున్నారు. ఈ క్రమంలో పలు మున్సిపాలిటీల్లో కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం సజావుగా సాగినప్పటికీ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎంపికలో మాత్రం ఘర్షణలు, ఆందోళనలతో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బాహాబాహికి దిగాయి. ఇక్కడ ఎక్స్ అఫీషియో ఓటుపై రెండు పార్టీల మధ్య వాగ్వాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఇరు పార్టీల శ్రేణుల వ్యతిరేక నినాదాలతో మున్సిపల్ ఆఫీస్ ప్రాంగణం హోరెత్తింది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ శబరీష్ అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. కౌన్సిలర్ల వాహనం జనగామ మున్సిపల్ కార్యాలయానికి సమీపంలోకి రాగానే తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. అయితే ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లో చైర్మన్ ఎన్నిక వాయిదా వేయాలంటూ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇక డోర్నకల్ లోనూ కాంగ్రెస్ కు స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ చైర్మన్ ఎన్నికను రేపటికి వాయిదా వేశారు.

-వరంగల్ వాయిస్ ప్రతినిధి



4లో..

## రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో సత్తా చాటాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- క్రీడాకారులకు స్పోర్ట్స్ షూ, టీ షర్ట్ అందజేత

## కార్పొరేట్ శక్తుల చేతుల్లో ఆర్థిక వ్యవస్థ బందీ

- పలువురు వక్తల ధ్వజం
- కేయూలో రెండు రోజుల జాతీయ సెమినార్ ప్రారంభం



6లో..



8లో..

## ప్రజావాణికి 65 ఫిర్యాదులు

- ప్రత్యేక దృష్టి సారించాలి
- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

# హైటెన్షన్..

- చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎంపికలో బాహాబాహి
- పరస్పర నినాదాలతో తొర్రూరు, జనగామలో ఉద్రిక్తత
- బీఆర్ఎస్ ఆధిక్యాన్ని దెబ్బతీసిన ఎక్స్ అఫీషియో సభ్యులు
- ఎర్రబెల్లిని అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు
- రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన ఎస్పీ శబరీష్
- జనగామ, తొర్రూరు, డోర్నకల్ లో రేపటికి వాయిదా




**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎన్నికలు గందరగోళంగా మారాయి. ఆరు జిల్లాల పరిధిలోని 12 మున్సిపాలిటీలలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారంతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎన్నిక సోమవారం జరగాల్సి ఉన్నప్పటికీ పలు మున్సిపాలిటీల్లో తీవ్ర ఉద్రిక్తతలు, హైటెన్షన్ వాతావరణం నెలకొంది. తొర్రూరు, జనగామలో అధికార కాంగ్రెస్ పార్టీతో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ బాహాబాహికి దిగడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దీంతో జనగామ, తొర్రూరు, డోర్నకల్ లో చైర్మన్ ఎన్నికను రేపటికి వాయిదా వేశారు. ముగిలిన మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అయితే పరకాల మున్సిపాలిటీ చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీకి చెందిన పావుశెట్టి సునీల్ కుమార్ ఎంపిక కాగా, వైస్ చైర్మన్ గా ఏకు దివ్య ఎంపికయ్యారు. అదేవిధంగా ములుగు చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్ర కళ, వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, వర్ధన్నపేట చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీకి చెందిన పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ గా ఇండిపెండెంట్ నేతావత్ శిభా రాణి, నర్సంపేట చైర్మన్ పెండెం శ్రీ లక్ష్మి (కాంగ్రెస్), వైస్ చైర్మన్ గందం నరేందర్ (కాంగ్రెస్) ఎంపికయ్యారు.




## తొర్రూరులో ఉద్రిక్తత..

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తొర్రూరు పట్టణ మున్సిపాలిటీలో 16 వార్డులకు గాను అధికార కాంగ్రెస్ పార్టీ ఏడు, బీఆర్ఎస్ తొమ్మిది వార్డులను గెలుచుకున్నప్పటికీ మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. తొమ్మిది వార్డుల్లో గెలిచిన బీఆర్ఎస్ తొర్రూరు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు తమకే వస్తాయని ఆశించారు. అయితే ఊహించని విధంగా స్థానిక ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఓటు వినియోగించుకోవడంతో కాంగ్రెస్ సంఖ్యాబలం తొమ్మిదికి చేరింది. దీంతో ఇరుపార్టీల బలాలు సమానం కావడంతో పాలకవర్గం ఎంపిక తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతోపాటు ఆ పార్టీ శ్రేణులు వరంగల్ ఎంపీ కడియం కావ్య ఓటు చెల్లదంటూ వివాదం లేవనెత్తారు. ఆమె గతేడాది వరంగల్ మున్సిపాలిటీలో ఎక్స్ అఫిషియోగా నమోదు చేసుకున్నందున ఆమె తొర్రూరు లో ఓటు వేయడం చెల్లదంటూ నిరసనకు దిగారు. వివాదం చిలికిచిలికి ఇరువర్గాలమధ్య తోపులాటకు దారితీసింది. దీంతో జిల్లా ఎస్పీ అంబరీష్ అదనపు బలగాలతో తొర్రూరు పట్టణానికి చేరుకున్నారు. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో పోలీసులు మున్సిపాలిటీ సమీపంలోని ఓ ఇంటిలో ఎర్రబెల్లిని గృహ నిర్బంధం చేశారు.

దీంతో ఆయన పోలీసులపై మండిపడ్డారు. భారతీయ పౌరసత్వం లేని హనుమాన్ల ఝాన్సీ రెడ్డిని మున్సిపాలిటీ వద్దకు ఎలా అనుమతిస్తారంటూ నిరసనతు దిగారు. దీంతో జాన్సిరెడ్డిని అక్కడినుంచి పంపించివేశారు. దీంతో ఇరు పార్టీల బలాబలాలు సమానం కావడంతో పాలకవర్గం ఎంపికలో హైడ్రామా నెలకొంది. అధికారులు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇరు పార్టీలకు చెందిన కౌన్సిలర్లను వారి క్యాంపులకు తరలివెల్లారు. కాగా కొందరు బీఆర్ఎస్ నాయకులు ఎంపీ కావ్య ఓటు చెల్లదంటూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.





## వర్ధన్నపేట కాంగ్రెస్ కైవసం..

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వర్ధన్నపేట మున్సిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. దీంతో స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ జెండాలు రెపరెపలాడాయి. నినాదాలతో పట్టణం మార్మోగింది. ప్రజల ఆశీస్సులతో మున్సిపాలిటీ పీఠాన్ని గెలుచుకున్నామని, ఇది పార్టీ శ్రేణుల కృషి, కార్యకర్తల త్యాగాల ఫలితమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు అభివృద్ధికి అనుకూలమని, వర్ధన్నపేట పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ చేపడతామన్నారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. వర్ధన్నపేట కాంగ్రెస్ గెలుపులో కీలక పాత్ర పోషించిన హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆయూబ్, మండలాధ్యక్షులు, పట్టణ నాయకులు, యువజన, మహిళా విభాగాల ప్రతినిధులకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. వర్ధన్నపేట పట్టణ ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అహర్నిశలు శ్రమించి వర్ధన్నపేటను రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ పారదర్శక, ప్రజాకేంద్రిత పాలన అందిస్తామని హామీ ఇచ్చారు.

## డోర్నకల్‌లో హాట్ టాపిక్..

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించాల్సిన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారంతో పాటు తొలి సమావేశం వాయిదా పడింది. నూతనంగా ఎన్నికైన 11 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు సమావేశానికి సకాలంలో రాకపోవడంతో ఈ కార్యక్రమం వాయిదా వేస్తున్నట్లు ప్రీసైడింగ్ అధికారి (జిల్లా అడిషనల్ కలెక్టర్–రెవెన్యూ) అనిల్ కుమార్ ప్రకటించారు. అయితే సీల్డ్ కవర్ రాజకీయాలతోనే ప్రమాణ స్వీకారం వాయిదా పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డోర్నకల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు మ్యాజిక్ ఫిగర్ దక్కినప్పటికీ పార్టీ హైకమాండ్ సూచనల మేరకు చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల పేర్లు 'సీల్ కవర్'లో నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆ పేర్లను అందరూ అంగీకరిస్తున్నట్లు సంతకాలు చేసి, మున్సిపల్ కమిషనర్ చదివిన సమయంలో చేతులు ఎత్తి మద్దతు తెలపాలని ఆదేశించినట్లు సమాచారం. రేపు మధ్యాహ్నం డోర్నకల్ మున్సిపల్ ఎన్నికల అధికారులు అధికారికంగా చైర్మన్, వైస్ చైర్మన్ పేర్లను ప్రకటించనున్నట్లు తెలిసింది. అయితే డోర్నకల్ రాజకీయాల్లో 'సీల్ కవర్ రాజకీయాలు' చర్చనీయాంశంగా మారాయి.



## పరకాల చైర్మన్‌గా సునీల్ కుమార్

**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మున్సిపాలిటీ కొత్త పాలకవర్గం కొలువుదీరింది. సోమవారం పరకాల మున్సిపాలిటీ కార్యాలయంలో ఇటీవల జరిగిన పరకాల మున్సిపాలిటీ ఎన్నికలలో గెలుపొందిన కౌన్సిలర్లచే రిటర్నింగ్ అధికారి, పరకాల ఆర్డీఓ కె.నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. కాంగ్రెస్ పార్టీ 13 అత్యధిక స్థానాలను గెలుచుకొని చైర్మన్, వైస్ చైర్ పర్సన్ స్థానాలను సొంతం చేసుకుంది. సోమవారం జరిగిన చైర్మన్ వైస్ చైర్ పర్సన్ల ఎన్నికల సంబంధించి సమావేశం జరగా చైర్మన్ గా పావుశెట్టి సునీల్ కుమార్, వైస్ చైర్పర్సన్ గా నాలుగో వార్డు అభ్యర్థి ఏక దివ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్







పార్టీ నుంచి గెలుపొందిన 13 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఆరుగురు కౌన్సిలర్లు, బీజేపీ నుంచి గెలుపొందిన ముగ్గురు కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం చైర్మన్ వైస్ చైర్మన్ ల ఎన్నికలకు సంబంధించి పోటీ నిర్వహించగా కాంగ్రెస్ పార్టీ ఏడవ వార్డు అభ్యర్థి పావిశెట్టి సునీల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. కాగా నాలుగో వార్డు అభ్యర్థి ఏకు దివ్యకు అనూహ్యంగా వైస్ చైర్ పర్సన్ పదవి దక్కింది. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా పార్టీ కోసం పనిచేసిన 19 వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్ కు పరకాల మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పదవి దక్కుతుందని అందరూ అనుకున్నారు. కానీ అనూహ్యంగా వైస్ చైర్పర్సన్ పదవి ఏకు దివ్య కు దక్కటంతో పార్టీ శ్రేణుల్లో విస్మయం కలిగింది.

### బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్ల ధర్నా..

తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎంపిక జరిగిందంటూ వీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. గెలుపొందిన కౌన్సిలర్లచే ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం చైర్మన్ ఎంపికను నిర్వహించారన్నారు. సమయం దాటిపోవడంతో మంగళవారం వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందని తమను బయటకు పంపించి లోపాయకారిగా వైస్ చైర్మన్ ఎన్నికను పూర్తి చేశారని ఆరోపించారు. పరకాల ఆర్డీఓ నిబంధనలను తుంగలో తొక్కారంటూ విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, పరకాల మున్సిపాలిటీ కమిషనర్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో సత్తా చాటాలి

- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్
- క్రీడాకారులకు కిట్లు పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నాలుగవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్ క్రీడల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా పేరు నిలబెట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. మంగళవారం నుంచి సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రారంభం కానున్న రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్ నేపథ్యంలో, సోమవారం సీపీ తన క్యాంపు కార్యాలయంలో క్రీడాకారులను ఉత్సాహపరిచారు. క్రీడా గ్రామంలో ఎగురవేయాల్సిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రీడా పతకాన్ని సీపీ పోలీస్ అధికారులు, క్రీడాకారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం పోటీల్లో పాల్గొనే క్రీడాకారులందరికీ సీపీ చేతుల మీదుగా ట్రాక్ సూట్లు, స్పోర్ట్స్ షూలు, టీ-షర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. పోలీసులు కేవలం శాంతిభద్రతల పరిరక్షణలోనే కాకుండా, క్రీడల్లో కూడా తమ సత్తా చాటగలరని నిరూపించాలి. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి శాఖాపరంగా ప్రత్యేక గుర్తింపు మరియు ప్రోత్సాహకాలు ఉంటాయని వెల్లడించారు. క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగయ్య, ఆర్.ఐ సతీష్, ఆర్.ఎస్.ఐ శ్రవణ్ కుమార్, క్యాంపు క్లర్క్ వేణుగోపాల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఔదార్యం చాటుకున్న సర్పంచ్



**వరంగల్ వాయిస్, వేలేరు :** నిత్యం గ్రామాన్ని శుభ్రంగా ఉంచుతూ, ప్రజా ఆరోగ్యం కోసం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పట్ల వేలేరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బిల్లా యాదగిరి తన ఉదారతను చాటుకున్నారు. తన ఐదేళ్ల పదవీ కాలంలో ప్రభుత్వం నుంచి వచ్చే గౌరవ వేతనాన్ని పూర్తిగా పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసమే కేటాయిస్తున్నట్లు ఆయన సంచలన నిర్ణయం తీసుకున్నారు. సర్పంచ్‌కు నెలకు వచ్చే గౌరవ వేతనం రూ.6,500 చొప్పున, ఐదేళ్ల కాలానికి అయ్యే మొత్తం రూ.3,90,000 పారిశుద్ధ్య కార్మికుల కోసం ఖర్చు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. గ్రామ వికాసంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని, వారి సేవలను గుర్తించి, వారిలో మరింత ఉత్సాహాన్ని నింపేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. సొంత లాభాన్ని పక్కన పెట్టి, శ్రమజీవుల సంక్షేమం కోసం తమ సర్పంచ్ తీసుకున్న నిర్ణయం పట్ల గ్రామ పంచాయతీ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కార్మికులు సర్పంచ్ బిల్లా యాదగిరిని కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పదవిని బాధ్యతగా భావించడమే కాకుండా, తన వేతనాన్ని త్యాగం చేసిన యాదగిరి తీరును మండలంలోని పలువురు నేతలు, ప్రజలు ప్రశంసిస్తున్నారు.

# సర్పంచ్ దంపతులకు సన్మానం

**సత్కరించిన డా.అప్పాల సుధాకర్ -ఇంద్ర దంపతులు**



**వరంగల్ వాయిస్, రేగొండ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం దమ్మన్నపేట గ్రామ నూతన సర్పంచ్ గా ఎన్నికైన గంజి అరుణ-రజనీకాంత్ దంపతులను ఆదివారం ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ అప్పాల సుధాకర్ - ఇంద్ర దంపతులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ దంపతులు మర్యాదపూర్వకంగా డాక్టర్ సుధాకర్ గృహానికి విచ్చేయగా, వారిని శాలువాతో సత్కరించి, పట్టు వస్త్రాలను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పాల సుధాకర్ మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేస్తూ గ్రామస్థుల మన్ననలు పొందాలని సూచించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, సేవాగుణంతో పనిచేసే వారికి ఎల్లప్పుడూ ప్రజల గుర్తింపు ఉంటుందని ఆయన గుర్తు చేశారు. దమ్మన్నపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, దమ్మన్నపేట గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఘనంగా 'విశ్వదీప్తి' పాఠశాల దశాబ్ది ఉత్సవాలు

- అలరించిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు



**వరంగల్ వాయిస్, మల్హర్ (కొయ్యూరు) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం కొయ్యూరులోని విశ్వదీప్తి ఇంగ్లీష్ మీడియం పాఠశాల 10వ వార్షికోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. పాఠశాల ప్రాంగణం విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రుల రాకతో ఒక పండుగలా మారిపోయింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ కొండ రాజమ్మ, ఉప సర్పంచ్ నవేందర్, ట్రాస్మా జిల్లా అధ్యక్షుడు సంపత్ రావు, ప్రధాన కార్యదర్శి జనగామ కార్తీక్ రావు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర గీతంతో వేడుకలు ఘనంగా మొదలయ్యాయి. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. జానపద, సినీ గీతాలకు విద్యార్థులు వేసిన స్టెప్పులు అలరించాయి. సామాజిక అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు ఆలోచింపజేశాయి. విద్యార్థులు తమలోని సృజనాత్మకతను చాటుతూ ప్రదర్శించిన విన్యాసాలు అందరి ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. పదేళ్ల ప్రస్థానంలో పాఠశాల సాధించిన ప్రగతిని అభినందిస్తూ, రాబోయే పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ సుదర్శన్ మాట్లాడుతూ.. పాఠశాల పదేళ్ల ప్రయాణంలో సహకరించిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో పాఠశాలలో మరిన్ని వసతులు కల్పిస్తూ, విద్యార్థుల సమగ్ర వికాసానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.






# వేయిస్తంభాల గుడిలో ఎంపీ కావ్య పూజలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని చారిత్రక రుద్రేశ్వర స్వామి (వేయిస్తంభాల) దేవాలయం భక్తిపారవశ్యంతో మునిగితేలింది. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి వేడుకల్లో భాగంగా ఆలయంలో నిర్వహించిన శివ-పార్వతుల కల్యాణ మహోత్సవంలో ఎంపీ స్వయంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు స్వామివారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఎంపీకి ఆశీర్వచనాలు అందజేసి, తీర్థప్రసాదాలను అందజేశారు. పూజల అనంతరం ఎంపీ డాక్టర్ కడియం కావ్య మీడియాతో మాట్లాడుతూ "రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, దేశంలో శాంతి, సుభిక్షం నెలకొనాలని ఆ మహాశివుడిని ప్రార్థించాను." భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయంలో కల్పించిన సౌకర్యాలను ఎంపీ స్వయంగా పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతంగా ఏర్పాట్లు చేసిన దేవస్థాన అధికారులను, సిబ్బందిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దేవస్థాన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# 'కృతిక్ష' కూచిపూడి నృత్యార్చన

**వేయిస్తంభాల ఆలయంలో ప్రదర్శన**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చారిత్రక వేయిస్తంభాల ఆలయంలో నిర్వహించిన సాంస్కృతిక వేడుకలు భక్తులను అలరించాయి. శివరాత్రి జాగారంలో భాగంగా భక్తుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక నృత్య ప్రదర్శనలో నగరంలోని కృష్ణా కాలనీకి చెందిన కుమారి కృతిక్ష తన కూచిపూడి నృత్యంతో విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ నృత్యకారిణి డాక్టర్ హరిత సారథ్యంలో నడుస్తున్న 'హరిత కళాక్షేత్రం'లో శిక్షణ పొందుతున్న కృతిక్ష, తన గురువు నేర్పిన విద్యను అద్భుతంగా ప్రదర్శించింది. శివతాండవం, కీర్తనలకు అనుగుణంగా ఆమె చేసిన ముద్రలు, అభినయం భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. జాగారంలో ఉన్న భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తూ సాగిన ఈ ప్రదర్శనలో కృతిక్ష కనబరిచిన ప్రతిభకు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ప్రశంసలు కురిపించారు. చిరు ప్రాయంలోనే శాస్త్రీయ నృత్యాన్ని అభ్యసిస్తూ, ఇంతటి చక్కని ప్రదర్శన ఇవ్వడం అభినందనీయమని అతిథులు కొనియాడారు.

# వైభవంగా శివ పార్వతుల కళ్యాణం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని అతి పురాతనమైన ఆరు శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలోని శ్రీ రాజ రాజేశ్వరి స్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం రాత్రి శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి వేద మంత్రాల మధ్య వైభవంగా నిర్వహించారు. దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి-రాజమణి దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలను మంగళ వాయిద్యాల మధ్య తీసుకువచ్చి స్వామివారి కళ్యాణానికి అందజేశారు. కళ్యాణ అనంతరం అర్ధరాత్రి శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ప్రతిష్టించి భజనలతో నృత్యాలు చేస్తూ గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ప్రజలు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి మంగళ హారతులు ఇచ్చారు. భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

# భక్తులపై పోలీసు అధికారి దురుసు ప్రవర్తన



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ కేంద్రంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీ భవాని సమేత కుంకుమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల వేళ ఒక పోలీసు అధికారి ప్రవర్తన వివాదాస్పదంగా మారింది. శివపార్వతుల కల్యాణం అనంతరం స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తుల పట్ల సదరు అధికారి అత్యుత్సాహంతో దురుసుగా ప్రవర్తించారని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం ఉత్సవమూర్తులను రథంపై ఉంచి పట్టణంలోని వాడవాడలా ఊరేగించారు. భక్తులు స్వయంగా రథాన్ని లాగుతూ భక్తిపారవశ్యంతో ఊరేగింపులో పాల్గొన్నారు. అయితే, ఊరేగింపు ముగిసి భక్తులు ఆలయం లోపలికి వెళ్తున్న సమయంలో రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారి ఒకరు విచక్షణ కోల్పోయి ప్రవర్తించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నైట్ డ్యూటీలో ఉన్న సదరు పోలీసు అధికారి, కనీసం మహిళా భక్తులని కూడా చూడకుండా వారిని నెట్టేస్తూ, ఇబ్బందులకు గురిచేశారని భక్తులు ఆరోపిస్తున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన వారిని దూషిస్తూ, అడ్డగిస్తూ దురుసుగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "వాడవాడలా రథాన్ని లాగి అలసిపోయి వచ్చిన మాపై పోలీసు అధికారి అంత కఠినంగా ప్రవర్తించాల్సిన అవసరం ఏముంది?" అని పలువురు మహిళా భక్తులు ప్రశ్నిస్తున్నారు. పవిత్రమైన పండుగ రోజున భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించిన సదరు అధికారిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.



# మణికంఠకు 'కాకతీయ పురస్కారం'

## శివరాత్రి వేడుకల్లో ప్రదానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ గడ్డపై పుట్టిన ప్రపంచ స్థాయి క్రీడాకారుడు, కరాటేలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించిన ప్రముఖ మార్షల్ ఆర్ట్స్ కోచ్ మణికంఠను 'కాకతీయ పురస్కారం' వరించింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏనుగుల రాకేష్ రెడ్డి ప్రతి ఏటా నిర్వహించే ఆధ్యాత్మిక సాంస్కృతిక వేడుకల్లో భాగంగా ఈ సత్కారం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసనమండలి సభ్యులు, ప్రభుత్వ విప్ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ మణికంఠకు పురస్కారాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరాటేలో ప్రపంచ స్థాయిలో పతకాలు సాధించడమే కాకుండా, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించి ఓరుగల్లు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. వేలాది మంది విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణనిస్తూ వారిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న మణికంఠ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ పురస్కార ప్రదానోత్సవంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, పద్మశ్రీ మొగులయ్య, నల్గొండ గద్దర్, రాధ మనోహర్ దాస్, నెల్లుట్ల రమాదేవి, కోదారి శీను, కాసర్ల శ్యామ్, గంటి నగేష్ శర్మ పాల్గొన్నారు. వీరితో పాటు పురుషోత్తం, ఓంకార్, వంశీ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, కార్తిక్, బొమ్మకంటి వెంకట్ గౌడ్, పలువురు ఆధ్యాత్మికవేత్తలు, రాజకీయ నాయకులు మణికంఠను శాలువాతో ఘనంగా సత్కరించారు. శివరాత్రి జాగారంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మణికంఠకు పురస్కారం అందజేయడం పట్ల క్రీడాకారులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యారంగంపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

- నిజామాబాద్‌లో ఏఐఎస్ఎఫ్ మహాసభలు
- గోడ పత్రికల ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు విద్యారంగాన్ని సమస్యల సుడిగుండంలోకి నెట్టేశాయని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.ఎ. స్టాలిన్ విమర్శించారు. ఫిబ్రవరి 18 నుంచి 20 వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరగనున్న ఏఐఎస్ఎఫ్ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ, సోమవారం హనుమకొండ హెడ్ పోస్ట్ ఆఫీస్ జంక్షన్‌లో మహాసభల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ప్రభుత్వాల తీరుపై నిప్పులు చెరిగారు. 'నూతన విద్యా విధానం-2020' పేరుతో విద్యను కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేస్తూ పేదలకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. తరగతి గదుల్లో మత విద్వేషాలు రెచ్చగొడుతూ విద్యార్థులను ఓట్ల రాజకీయం కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ విద్యాశాఖ మంత్రిని నియమించలేకపోవడం శోచనీయమన్నారు. రూ. 9,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లు కనీస సౌకర్యాలు లేక కొట్టుమిట్టాడుతున్నాయని, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చినా నిధుల విడుదలపై స్పష్టత లేకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. నిజామాబాద్‌లో జరిగే మూడు రోజుల మహాసభలు విద్యార్థి ఉద్యమాలకు కొత్త దిశానిర్దేశం చేస్తాయని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి 750 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. పెరుగుతున్న ఫీజులు, నిరుద్యోగం, హాస్టల్ సమస్యలపై సుదీర్ఘ చర్చలు జరిపి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ కుమార్, నాయకులు మేకల అభిరామ్, మాదరపు శ్రేయాస్, పోలబోయిన కార్తీక్, ఒగ్గు సాయికుమార్, ఇనుగాల రాజ్ కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులకు 'ప్రీ ప్రమోషనల్' శిక్షణ

## ముఖ్య అతిథిగా హాజరైన కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి



**వరంగల్ వాయిస్, మామునూరు :** తెలంగాణ స్టేట్ ఆర్మ్‌డ్ పోలీస్ విభాగంలో పదోన్నతులు పొందనున్న పోలీసులకు ముందస్తు శిక్షణా కార్యక్రమం సోమవారం మామునూరులోని 4వ బెటాలియన్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణను ప్రారంభించారు. తెలంగాణ ఆర్మ్‌డ్ పోలీస్ విభాగంలో వేర్వేరు హోదాల్లో పదోన్నతులు పొందేందుకు మొత్తం 296 మంది సిబ్బందికి ఈ శిక్షణ ఇస్తున్నారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి హెడ్ కానిస్టేబుల్స్ గా పదోన్నతి పొందే 244 మందికి రెండు వారాల పాటు శిక్షణ ఉంటుంది. అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్, నుంచి సబ్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతి పొందే 52 మందికి నాలుగు వారాల పాటు శిక్షణ ఉంటుంది. శిక్షణలో భాగంగా నిష్ణాతులైన శిక్షకులచే పలు కీలక అంశాలపై అవగాహన కల్పిస్తామని కమాండెంట్ తెలిపారు. నూతన చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియంలతో పాటు పోలీస్ మాన్యువల్, పర్సనాలిటీ డెవలప్మెంట్ పై హెడ్ కానిస్టేబుల్స్ కు శిక్షణ ఇస్తారు. ఎక్స్‌ట్రీమిజం, డిజాస్టర్ మేనేజ్మెంట్, విఐపి సెక్యూరిటీ, గార్డ్స్ అండ్ ఎస్కార్ట్స్, లీడర్‌షిప్, మేనేజ్మెంట్ అంశాలపై లోతైన శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ కృష్ణప్రసాద్, వీరన్న, ఆర్.ఐలు కార్తిక్, రవి, రాజిరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, కృష్ణ, యూనిట్ మెడికల్ ఆఫీసర్స్ శిరీష, శ్రావణ్ తో పాటు శిక్షణార్థులు, బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

# కూలీల హక్కులను హరిస్తున్న కేంద్రం




**వరంగల్ వాయిస్, దామెర :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ కూలీల హక్కులను కాలరాస్తోందని, వారి పని హక్కును హరించేందుకే 'వీబీ గ్రామ్ జీ' బిల్లు 2025ను తీసుకువస్తోందని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ ధ్వజమెత్తారు. హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఒగ్లాపూర్ గ్రామంలో సోమవారం ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి, నూతన చట్టం వల్ల కలిగే నష్టాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. దేశంలో వామపక్షాలు, సామాజిక శక్తుల సుదీర్ఘ పోరాట ఫలితంగా వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు.'వికసిత్ భారత్ - జీ రామ్ జీ' పేరుతో తెస్తున్న ఈ బిల్లు వల్ల కూలీలకు లభించే పని గ్యారంటీ తగ్గిపోతుందని, ప్రభుత్వ బాధ్యతలను విస్మరించేలా నిబంధనలు ఉన్నాయని విమర్శించారు. గతంలో రైతాంగ వ్యతిరేక నల్ల చట్టాలను రైతులు ఏ విధంగానైతే ఐక్యంగా అడ్డుకున్నారో, అదే స్ఫూర్తితో కూలీలు కూడా ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని, చట్టం రక్షణ కోసం తాము సిద్ధమని ప్రతిజ్ఞ చేశారు.

# విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యం

- ఏఐఎఫ్డీఎస్ ఆధ్వర్యంలో 'టాలెంట్ టెస్ట్'



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికితీయడానికి విద్యార్థి సంఘాలు కృషి చేయడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి ఫ్లోరెన్స్, 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి పేర్కొన్నారు. సోమవారం కరీమాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి 'టాలెంట్ టెస్ట్' కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. రాబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఎటువంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసేలా సిద్ధం చేయడానికి ఈ టాలెంట్ టెస్ట్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణలోనూ ఆదర్శంగా నిలవాలని, సమయాన్ని వృథా చేయకుండా చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. మారుతున్న విద్యా వ్యవస్థకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకోవాలని, భవిష్యత్తు తరాలకు ఈ పాఠశాలను ఒక దిక్సూచిలా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఇలాంటి పరీక్షలు ఒక వేదికగా నిలుస్తాయని ఏఐఎఫ్డీఎస్ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్డీఎస్ జిల్లా కార్యదర్శి చుక్క ప్రశాంత్, పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి మార్త నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్, ఉపాధ్యాయ బృందం, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# పరకాలను 'మోడల్ మున్సిపాలిటీ'గా తీర్చిదిద్దుతా

◆ పట్టణ ప్రజలకు ఎమ్మెల్యే రేవూరి కృతజ్ఞతలు



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని, కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో 13 మంది కౌన్సిలర్లను గెలిపించినందుకు పట్టణ ప్రజలకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నూతన పాలకవర్గం ప్రజలు మెచ్చేలా, పారదర్శకమైన పాలన అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పట్టణాభివృద్ధిపై తనకున్న స్పష్టమైన విజన్‌ను రేవూరి ఈ సందర్భంగా వివరించారు. ఇప్పటికే రూ.38 కోట్లతో పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని, మరో రూ.35 కోట్లతో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేసి పరకాలను జిల్లా స్థాయి పట్టణంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. విద్యాభివృద్ధి కోసం 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' ఏర్పాటు చేయడంతో పాటు, యువతకు ఉపాధి కల్పించేందుకు ఐటీఐ, టాస్క్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను నెలకొల్పుతామని వెల్లడించారు. గతంలో మార్కెట్ భవనం కోసం నిర్మించిన చోట ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తామని, వాణిజ్య కార్యకలాపాలను మెరుగుపరుస్తామని తెలిపారు. రాజకీయాల్లో నైతిక విలువలు ఉండాలని రేవూరి పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు 13 స్థానాలు ఇచ్చి ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చినా, గెలిచిన తమ కౌన్సిలర్లను బీఆర్ఎస్ నాయకులు ప్రలోభాలకు గురిచేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీలు ఎన్ని కుట్రలు పన్నినా కాంగ్రెస్ జైత్రయాత్రను అడ్డుకోలేకపోయాయని ఎద్దేవా చేశారు. పరకాల నియోజకవర్గంలో రౌడీయిజం, అరాచక శక్తులకు తావులేదని రేవూరి హెచ్చరించారు. శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉంటామని, రౌడీయిజాన్ని చట్టపరంగా ఉక్కుపాదంతో అణచివేస్తామని స్పష్టం చేశారు. పరకాల పట్టణాన్ని గత పాలకులు నిర్లక్ష్యం చేశారని, ఆ వెనుకబాటుతనాన్ని తొలగించి రాబోయే రెండేళ్లలో మౌలిక వసతులన్నీ పూర్తి చేస్తామని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్, వైస్ చైర్మన్ ఏకు దివ్య విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెట్టుగుట్టలో 'అగ్నిగుండాల' వైభవం

అగ్నిగుండంలో నడిచిన హెడ్ కానిస్టేబుల్ జయరాజు



**వరంగల్ వాయిస్, మడికొండ :** వరంగల్ నగర సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మడికొండ మెట్టుగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో అగ్నిగుండాల మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ప్రతి ఏటా నిర్వహించే ఈ వేడుకను దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. కులమత భేదాలకు అతీతంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో పులకించింది. స్వామివారిపై ఉన్న అచంచల విశ్వాసంతో భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండాలను ప్రవేశించారు. "ఓం నమఃశివాయ" స్మరణల మధ్య నిప్పుల గుండంపై నడుస్తూ తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మడికొండ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ జి.జయరాజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన వరుసగా మూడో ఏడాది కూడా స్వయంగా అగ్నిగుండాల్లో నడిచి తన భక్తిని చాటుకున్నారు. వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మడికొండ పోలీసులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అగ్నిగుండాల వద్ద భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక నిఘా ఉంచారు. భక్తి వైభవాన్ని ప్రతిబింబిస్తూ సాగిన ఈ వేడుకతో మడికొండ పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

# 'విద్యా ఫౌండేషన్' పురస్కారాలు

మార్చి 15లోగా దరఖాస్తు చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ (వడ్డేపల్లి) :** ప్రతిభా వంతులైన దివ్యాంగ, అనాథ విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రతి ఏడాది అందజేసే 'విద్యా ఫౌండేషన్ ప్రతిభా పురస్కారాలు – 2025' ప్రకటన విడుదలైంది. సంస్థ పన్నెండవ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ అవార్డులను అందజేయనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్ల మహేందర్ తెలిపారు. సోమవారం వడ్డేపల్లిలోని సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 2025 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేదా ప్రైవేట్ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతూ, అత్యధిక ప్రతిభ కనబరిచిన దివ్యాంగ, అనాథ విద్యార్థులు ఈ పురస్కారాలకు అర్హులని తెలిపారు. మొత్తం 10 మంది దివ్యాంగ విద్యార్థులు, 10 మంది అనాథ విద్యార్థులను పురస్కారాలకు ఎంపిక చేస్తారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి రూ.1016 నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని ఫౌండేషన్ వార్షికోత్సవ వేదికపై అందజేస్తారు. అర్హత కలిగిన విద్యార్థులు తమ పదవ తరగతి మార్కుల మెమోలను (ప్రోగ్రెస్ రిపోర్ట్/మెమో) వచ్చే నెల మార్చి 15 లోపు ఫౌండేషన్ కార్యాలయంలో అందజేయాలి. ఇతర వివరాలకు 9177604430 నంబర్‌ను సంప్రదించాలని మహేందర్ కోరారు. ఈ సమావేశంలో ఫౌండేషన్ బాధ్యులు కలకోట్ల నరేందర్, చింతల కమల, కడుదుల సోమయ్య, ఎన్.ఈషారాణి, ముప్పాళ్ళ కరుణశ్రీ, కూరపాటి శ్రీనివాసు, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు స్ఫూర్తిదాయకం

▪ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా చారిత్రక వేయిస్తంభాల దేవాలయానికి పోటెత్తిన భక్తులకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అందించిన సేవలు అభినందనీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొనియాడారు. కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఎంతో ఓపికతో భక్తులకు సేవలందించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఏవీవీ కాలేజీ, వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీ, కేయూ బయోటెక్నాలజీ కళాశాలలకు చెందిన సుమారు 90 మంది వలంటీర్లు మూడు షిఫ్టులుగా విడిపోయి, ఆదివారం తెల్లవారుజామున 5 గంటల నుంచి సోమవారం ఉదయం 5 గంటల వరకు (24 గంటలు) నిరంతరాయంగా సేవలు అందించారు.పెరుగుతున్న ఎండ దృష్ట్యా క్యూలైన్లలో ఉన్న భక్తులకు సుమారు 5,000 వాటర్ బాటిళ్లతో పాటు చల్లని మంచినీటిని సరఫరా చేశారు. వృద్ధులు, చిన్న పిల్లలు మరియు దివ్యాంగులకు దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వాలంటీర్లు స్వయంగా తోడ్పాటునందించారు. రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికీ, భక్తులు క్రమ పద్ధతిలో స్వామివారిని దర్శించుకునేలా క్యూలైన్లను సమన్వయం చేశారు. వలంటీర్ల సేవలను గుర్తించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో పాటు వేయిస్తంభాల గుడి ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, ఈవో అనిల్ కుమార్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సేవా బృందాన్ని ముందుండి నడిపించిన మాజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, కేయూ బయోటెక్నాలజీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాధికని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొని వలంటీర్ల సేవలకు కృతజ్ఞతలు తెలిపారు.

# భర్త మరణాన్ని తట్టుకోలేక.. మనోవేదనతో భార్య మృతి



**వరంగల్ వాయిస్, రేగొండ :** భర్త దూరమయ్యాడన్న బాధ ఆమెను కుంగదీసింది. ఆయన లేని జీవితం వద్దనుకుందో ఏమో.. భర్త మరణించిన 25 రోజులకే భార్య కూడా కన్నుమూసిన విషాద ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఒకే నెలలో భార్యాభర్తలు ఇద్దరూ మరణించడంతో ఆ కుటుంబంలో తీరని శోకం మిగిలింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు తడక శ్రీకాంత్ తండ్రి తడక స్వామి గత 25 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి ఆయన భార్య రాధ తన భర్త జ్ఞాపకాలను తలచుకుంటూ తీవ్ర మనోవేదనకు గురయ్యారు. భర్త మరణాన్ని తట్టుకోలేక, భోజనం సరిగా తీసుకోకుండా ఎప్పుడూ దిగులుగా కనిపిస్తుండేవారు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం రాధకు అకస్మాత్తుగా తీవ్రమైన గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు గమనించే లోపే ఆమె తనువు చాలించారు. "నీవు లేని లోకంలో నేను ఉండలేను" అన్నట్లుగా భర్త వెంటే ఆమె కూడా అనంత లోకాలకు పయనమవ్వడం స్థానికులను కన్నీరు పెట్టించింది. కొన్ని రోజుల వ్యవధిలోనే అన్యోన్యంగా ఉండే భార్యాభర్తలు ఇద్దరూ మరణించడంతో రేగొండ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతురాలు రాధ అంత్యక్రియలకు స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులు అర్పించారు. యువ నాయకుడు తడక శ్రీకాంత్ కుటుంబాన్ని పలువురు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# భక్తులకు పండ్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండి బజార్ లోని సిద్ధి విశ్వేశ్వర ఆలయం ప్రాంగణంలో భక్తులకు పండ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్.ఏ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దైవ భక్తితో శివ దేవాలయాలు దర్శించి వివిధ రకాల పూజలు నిర్వహిస్తూ భక్తి పారవశ్యంలో ఉంటారు. వారికి సాయంకాలం పండ్ల పంపిణీ చేయడం జరిగిందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో శైలజ, నాగేందర్, మహేందర్, ఎల్లయ్య, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# ధర్మభిక్షం ఆశయ సాధనకు పోరాడాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం అందించిన పోరాట స్ఫూర్తితో బహుజనులు రాజ్యాధికారం కోసం పోరాడాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఆదివారం వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్లో కల్లుగీత పనివారల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బైరి తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో ధర్మభిక్షం 104వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం వెంకట్రాములు మాట్లాడుతూ.. ధర్మభిక్షం సీపీఐ శాసనసభ్యులుగా, పార్లమెంటు సభ్యులుగా ఉన్న కాలంలో పీడిత ప్రజల ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమించారని కొనియాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ బడుగు బలహీన వర్గాలు చైతన్యంతో సంఘటితమై రాజ్యాధికారం కోసం పోరాడటమే ధర్మభిక్షం గారికి ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పేదలకు పండ్లను పంపిణీ చేశారు. బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి, జిల్లా నాయకులు కట్కోజు చంద్రశేఖర్, లింగబత్తిని రామకృష్ణ, పి.సూర్యనారాయణ, సారయ్య, యాదగిరి పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండల కేంద్రానికి చెందిన రైతు కొంకాల మీనారెడ్డి ఇటీవల మృతిచెందగా కాంగ్రెస్ సీనియర్ జిల్లా నాయకులు, స్థానిక మాజీ సర్పంచ్ మోడెం ఉమేష్ గౌడ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండల కేంద్రానికి చెందిన రైతు మీనా రెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడం పట్ల ఉమేష్ గౌడ్, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా మృతి చెందిన మీనారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తమ వంతు సహాయంగా రూ.2000 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచి గండి తిరుపతి గౌడ్, రూపురెడ్డి లింగారెడ్డి, గోగుల అశోక్ రెడ్డి, గుర్రాల రాజిరెడ్డి, గండి తిరుపతి గౌడ్, కట్ల రాజిరెడ్డి, కట్ల చంద్రారెడ్డి, గుర్రాల వెంకటరెడ్డి, పద్మశాలి సంఘం అధ్యక్షులు మాచర్ల స్వామి పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు హాలులో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆమె స్వయంగా పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే అర్జీలపై అధికారులు ఉదాసీనంగా ఉండకూడదని, తక్షణమే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదికలు సమర్పించాలని తహసీల్దార్లను, జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ రోజు జరిగిన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకుంటూ మొత్తం 89 అర్జీలను అందజేశారు. వీటిలో అత్యధికంగా భూ సంబంధిత సమస్యలు, పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇతర మౌలిక వసతులకు సంబంధించినవి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.రవి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి. గణేష్, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, డీఆర్డీఓ మేన శ్రీను, సీపీఓ సత్యనారాయణ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. వచ్చిన ప్రతి అర్జీని కంప్యూటరీకరించి, వాటి స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

# డాక్టర్ శ్రీశైలంకు 'ఉత్తమ పరిశోధక అవార్డు'



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండకు చెందిన ప్రముఖ ఫిజిక్స్ అధ్యాపకులు, ఎస్ఆర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీశైలం మరో అంతర్జాతీయ స్థాయి గుర్తింపును దక్కించుకున్నారు. ఫిజిక్స్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆయనకు 'ఉత్తమ పరిశోధక అవార్డు – 2025'ను ప్రదానం చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ అతిథి గృహంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. పీటీడబ్ల్యూఏ సమావేశంలో భాగంగా కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ నాగేశ్వరరావు, ప్రొఫెసర్ శ్రీనాథ్, ప్రొఫెసర్ ప్రసాద్, ప్రొఫెసర్ గోపాల్ రెడ్డి, ప్రొఫెసర్ వరలక్ష్మి వంటి దిగ్గజ విద్యావేత్తల చేతుల మీదుగా డాక్టర్ శ్రీశైలం ఈ అవార్డును స్వీకరించారు. భౌతిక శాస్త్ర రంగంలో ఆయన చేసిన విశేష పరిశోధనలకు గాను ఈ ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. డాక్టర్ శ్రీశైలం సాధించిన ఈ ఘనతపై ఎస్ఆర్ విద్యాసంస్థల అధిపతి, ఛాన్సలర్ ఏ.వరదా రెడ్డి, ప్రో ఛాన్సలర్ ఏ.మధూకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, ప్రో వి.సి.ప్రొఫెసర్ మహేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటరమణారావులతో పాటు ఎస్ఆర్ యూనివర్సిటీ అధ్యాపక బృందం, పరిశోధక విద్యార్థులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

# కార్పొరేట్ శక్తుల చేతుల్లో భారత ఆర్థిక వ్యవస్థ

- సెమినార్ లో వక్తలు ధ్వజం
- కేయూలో రెండు రోజులు జాతీయ సెమినార్




**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కేవలం రాజకీయ లబ్ధి కోసం కాకుండా, పీడిత ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేలా ఉండాలని ప్రముఖ సామాజిక తత్వవేత్త, ప్రొఫెసర్ కంచ ఐలయ్య హితవు పలికారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "భారతదేశంలో సరళీకరణ అనంతరం జనరంజక విధానాలు" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ ఘనంగా ప్రారంభమైంది. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో దేశ ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై మేధావులు ఆసక్తికర చర్చ జరిపారు. కీనోట్ ప్రసంగం చేసిన కంచ ఐలయ్య ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. 1991 నుంచి అమలవుతున్న సరళీకరణ విధానాలు 90 శాతం ప్రైవేటు పెట్టుబడిదారులకే మేలు చేశాయని, సామాన్యులకు కేవలం 10 శాతమే దక్కాయని మండిపడ్డారు. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని చల్లార్చి, రాజకీయ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికే సంక్షేమ పథకాలను ఒక ఆయుధంగా వాడుకుంటున్నారని విమర్శించారు. బడ్జెట్‌లో 40 శాతం కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని, పేదలకు ఉచిత విద్య, వైద్యంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ అంతర్జాతీయ ఒప్పందాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు పొంచి ఉన్న ముప్పును వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను తన గుప్పిట్లో ఉంచుకోవడం వల్ల రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతోందని, రాజ్యాంగ సంస్థల తీరుతో ఫెడరల్ వ్యవస్థ సంక్షోభంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా, యూరప్ దేశాలతో చేసుకుంటున్న వాణిజ్య ఒప్పందాలు దేశ రైతాంగానికి, ఆర్థిక వ్యవస్థకు గొడ్డలి పెట్టుగా మారాయని హెచ్చరించారు. ప్రముఖ పత్రిక సంపాదకులు డాక్టర్ కే.శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంలో యూపీఏ ప్రభుత్వం సంక్షేమాన్ని ప్రజల హక్కుగా మార్చిందని, కానీ నేటి మార్కెటీకరణ విధానాల్లో ఆ పథకాలు ఒక్కొక్కటిగా నిర్వీర్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాపరెడ్డి మాట్లాడుతూ సమకాలీన రాజకీయాల్లో ఇటువంటి చర్చల ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పరిశోధకులు సమర్పించిన పరిశోధన పత్రాలు, సెమినార్ ప్రొసీడింగ్స్ బుక్‌ను అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్లు సీహెచ్.దినేష్ కుమార్, వీరన్న, పెద్ద సంఖ్యలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 'సీఎం కప్' రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్

- 20 నుంచి జేఎన్ఎస్ గ్రౌండ్స్‌లో పోటీలు
- రాష్ట్రవ్యాప్తంగా తరలిరానున్న క్రీడాకారులు
- ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ నగరం మరో భారీ క్రీడా వేడుకకు వేదిక కానుంది. 'సీఎం కప్' రెండో ఎడిషన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఈ నెల 20 నుంచి 23 వరకు హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి వెల్లడించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో, కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో తెలంగాణలోని అన్ని జిల్లాల నుండి సుమారు 1500 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు వసతి, భోజనం, రవాణా విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారులు విడిది చేసే ప్రాంతాల్లో మౌలిక వసతులు, పరిశుభ్రమైన భోజనం అందించేలా చూడాలని సూచించారు. స్టేడియం వద్ద నిరంతరం అందుబాటులో ఉండేలా మెడికల్ క్యాంపులు, అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, స్టేడియం వద్ద పటిష్ట భద్రత కల్పించాలని పోలీసు శాఖకు సూచించారు. జేఎన్ఎస్ గ్రౌండ్‌ను పోటీలకు అనుగుణంగా సిద్ధం చేయాలని క్రీడల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా యువజన క్రీడల అధికారి అశోక్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి గిరిరాజ్ గౌడ్, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, డీఏఈఓ గోపాల్, డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, ఇతర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలు కావడంతో హనుమకొండ జిల్లా ప్రతిష్ట పెరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ వేడుకను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.

# 'ఓవరాల్ ఛాంపియన్'గా థౌజెండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్

- రీజన్ మీట్‌లో అవార్డుల పంట..
- సేవా కార్యక్రమాల్లో బెస్ట్ క్లబ్‌గా గుర్తింపు
- అంగరంగ వైభవంగా రామప్ప రీజన్ మీట్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** లయన్స్ ఇంటర్నేషనల్ 320ఎఫ్ జిల్లాకు చెందిన నాలుగవ రీజన్ (రామప్ప రీజన్) మీట్‌లో థౌజెండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. సేవలోనూ, సంస్థాగత ప్రదర్శనలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 'ఓవరాల్ ఛాంపియన్'గా నిలిచింది. హన్మకొండలోని మయూరి గార్డెన్స్‌లో రీజన్ చైర్‌పర్సన్ ఊరుగొండ రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ రీజన్ మీట్ వేడుకలు అట్టహాసంగా సాగాయి. 2025–26 లయనిస్టిక్ సంవత్సరంలో క్లబ్ చేపట్టిన విస్తృత సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా పలు విభాగాల్లో అవార్డులు దక్కించుకుంది. ముఖ్యంగా సేవలను వివరించే 'బ్యానర్ ప్రజెంటేషన్'లో బెస్ట్ బ్యానర్ అవార్డును కైవసం చేసుకుంది. బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ సెక్రెటరీ, బెస్ట్ హెల్త్ క్యాంప్స్, బెస్ట్ హంగర్ రిలీఫ్, బెస్ట్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్, బెస్ట్ నీడ్ బేస్డ్ యాక్టివిటీస్, బెస్ట్ డయాబెటిక్ క్యాంప్స్, బెస్ట్ ఫోటో ఎగ్జిబిషన్ వంటి అవార్డులను క్లబ్ సొంతం చేసుకుంది. ఈ పురస్కారాలను జిల్లా గవర్నర్ లయన్ చంద్రశేఖర్ ఆర్య, మొదటి ఉప గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి, రెండవ ఉప గవర్నర్ హరికిషన్ రెడ్డి, రీజన్ చైర్‌పర్సన్ ఊరుగొండ రాజేందర్ చేతుల మీదుగా క్లబ్ ప్రతినిధులు స్వీకరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు పరికిపండ్ల వేణు, సెక్రటరీ వైద్యం రాజగోపాల్ మాట్లాడుతూ.. రీజన్ స్థాయిలో క్లబ్ ఇంతటి ఘనత సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. సభ్యులందరి సమిష్టి కృషి, నిస్వార్థ సహాయ సహకారాల వల్లే ఇన్ని అవార్డులు దక్కాయని, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ వేడుకలో క్లబ్ సీనియర్ సభ్యులు వేణుమాధవ్, నరేందర్, అంజిరెడ్డి, మురళి, వామనరావు, రమేష్, చంద్రశేఖర్, శ్రవణ్ కుమార్, కరుణాకర్ రెడ్డి, సత్యనారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
సోమవారం 16 జనవరి 2026
7

# మార్చిలో రానున్న ఉస్తాద్ భగత్ సింగ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న భారీ మాస్ ఎంటర్‌టైనర్ ఉస్తాద్ భగత్ సింగ్ విడుదలకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో రాశి ఖన్నా, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తుండగా, మాస్ కమర్షియల్ చిత్రాలకు కేరాఫ్ గా ఉన్న ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. సంగీత బాధ్యతలను రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ చేపట్టారు. మార్చి 26న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం మరింత వేగవంతం చేసింది. ఇటీవల విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' లిరికల్ వీడియో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ పాటకు భారీ స్పందన లభించగా, అనేక మంది అభిమానులు వాట్సాప్ స్టేటస్‌లుగా కూడా పెట్టుకున్నారు. పవన్ కళ్యాణ్ మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు దేవిశ్రీప్రసాద్ అందించిన ఎనర్జిటిక్ బీట్‌లు జత కావడంతో ఈ సాంగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. మొదటి పాట సూపర్ హిట్ కావడంతో సినిమా మీద హైప్ మరింత పెరిగింది. ఇప్పటికే మొదటి సాంగ్ సక్సెస్ కావడంతో రెండో పాట కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో చిత్రబృదం 'ఆరా ఆఫ్ ఉస్తాద' అనే రెండో సాంగ్‌ను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన పోస్టర్ ప్రత్యేక డిజైన్‌తో ఉండి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ లుక్, మాస్ అటిట్యూడ్ పోస్టర్‌లో హైలైట్ కావడంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత రెట్టింపైంది. గతంలో పవన్ కళ్యాణ్ ? హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన గబ్బర్ సింగ్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించి పవన్ కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించింది. అదే కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో 'ఉస్తాద్ భగత్ సింగ' కూడా మాస్ హిట్ అవుతుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా కనిపిస్తోంది.




## ఉదయ్‌పూర్‌లో పెళ్లి ?


**మార్చి4న హైదరాబాద్‌లో రిసిప్షన్ అంటూ ప్రచారం**

టాలీవుడ్‌లో హిట్ ఫెయిర్ హీరో విజయ్ దేవరకొండ హీరోయిన్ రష్మిక మందన్న పెళ్లి వార్తలు ఇప్పుడు మరింత జోరందుకున్నాయి. వీరు వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతోంది. ఫిబ్రవరి చివరి వారంలో వీరి పెళ్లి జరగనుందనే టాక్ ఇండస్ట్రీలో సెన్సేషన్ సృష్టిస్తోంది. రాజస్థాన్‌లోని అందమైన నగరం ఉదయ్‌పూర్ లోని ఓ రాయల్ ప్యాలెస్‌లో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య సింపుల్‌గా పెళ్లి వేడుక జరపాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 26 తేదీని ముహూర్తంగా ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో చర్చ నడుస్తోంది. ఈ వేడుకను గోప్యంగా ఉంచేందుకు ఎంత ప్రయత్నించినా సోషల్ మీడియాలో సమాచారం లీక్ అవుతూనే ఉండటం గమనార్హం. పెళ్లి వేడుక ఉదయ్‌పూర్‌లో సాదాసీదాగా జరిగినా, అసలు హంగామా మాత్రం హైదరాబాద్ లోనే ఉండబోతుందని టాక్. మార్చి 4న నగరంలోని ప్రముఖ వేదికలో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం భారీ రిసెప్షన్ నిర్వహించనున్నట్లు సమాచారం. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్ సెలబ్రిటీలు ఈ వేడుకకు హాజరవుతారని అంచనాలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవల విజయ్ దేవరకొండ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ఆహ్వాన పత్రిక అందించారనే ప్రచారం ఈ పెళ్లి వార్తలకు మరింత బలం చేకూర్చింది. తాజాగా విజయ్ దేవరకొండ వెడ్డింగ్ కార్డ్ నెట్టింట వైరల్ అవుతుంది. ఇది చాలా సింపుల్‌గా కనిపిస్తుంది. ఈ ఇన్విటేషన్ ప్రకారం వారి వివాహం ఫిబ్రవరి 26న వివాహవం జరగనుందని అర్థమవుతుంది. ఈ సెలబ్రిటీ వెడ్డింగ్ రిసెప్షన్‌కు ప్రముఖ దర్శకులు, నిర్మాతలు, స్టార్ హీరోలు హాజరవుతారనే అంచనాలు ఉన్నాయి.




## ఫౌజీ షూటింగ్‌లో ప్రభాస్‌కు గాయం

ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం ఫౌజీ షూటింగ్‌లో స్వల్ప ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. గుర్రపు స్వారీ సన్నివేశం చిత్రీకరణ సమయంలో ప్రభాస్ కింద పడిపోవడంతో చేతులకు చిన్న గాయాలు అయినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. చిత్ర బృందం వెంటనే స్పందించి ప్రథమ చికిత్స అందించగా, గాయాలు తీవ్రంగా లేవని తెలిసింది. వైద్యులు ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం ప్రభాస్ సురక్షితంగానే ఉన్నారని, త్వరలోనే మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నారని యూనిట్ తెలిపింది. ఈ వార్తతో అభిమానులు తొలుత ఆందోళన చెందగా, గాయాలు చిన్నవేనని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. 'ఫౌజీ' చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో సీతారామంతో ప్రశంసలు అందుకున్న ఆయన, ఈసారి మరింత ఎమోషన్‌తో కూడిన యాక్షన్ డ్రామాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని టాక్. ఈ సినిమాలో ప్రభాస్ బ్రిటిష్ సైనికుడి పాత్రలో కనిపించ నున్నారని సమాచారం. దేశభక్తి, ప్రేమ, త్యాగం వంటి అంశాలతో కథ నడుస్తుందని తెలుస్తోంది. గుర్రపు స్వారీతో కూడిన హై వోల్టేజ్ చేజింగ్ సన్నివేశం సినిమాకే హైలైట్‌గా నిలవనుందని, భారీ సెట్స్ మరియు విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సన్నివేశాలను రూపొందిస్తున్నారని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తోంది.




## ప్రమోషన్స్ పూర్తి చేసుకున్నాక టైటిల్ వివాదాలు

సినిమా ప్రమోషన్లన్నీ పూర్తి చేసుకున్నాక, సరిగ్గా సెన్సార్ సర్టిఫికేట్ వచ్చే సమయంలో టైటిల్ మార్చాల్సి రావడం నిర్మాతలకు పెద్ద తలనొప్పిగా మారింది. తాజాగా యంగ్ హీరో సుహాస్ నటించిన సినిమా కూడా ఇదే సమస్యను ఎదుర్కొంది. కేవలం సుహాస్ మాత్రమే కాదు, ఈ మధ్య కాలంలో మరికొన్ని చిన్న సినిమాలు కూడా సెన్సార్ అజెక్షన్స్ వల్ల పేర్లు మార్చుకున్నాయి. సుహాస్, శివానీ నగరం జంటగా నటించిన చిత్రం 'హే భగవాన'. ఈ నెల 20న విడుదలకు సిద్ధమైన ఈ సినిమాపై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. దేవుడి పేరుతో ఉన్న టైటిల్ వల్ల కొన్ని వర్గాల సెంటిమెంట్స్ దెబ్బతినే అవకాశం ఉందని భావించిన బోర్డు, పేరు మార్చాలని సూచించింది. దీంతో మేకర్స్ చేసేదేమీ లేక చివరి నిమిషంలో టైటిల్‌ను 'హే బలవంత్!' గా మార్చారు. ప్రమోషన్లన్నీ పాత పేరుతోనే జరగడంతో ఈ మార్పు సినిమాపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని చిత్ర యూనిట్ ఆందోళన చెందుతోంది. ఇటీవల విడుదలైన 'వానర' చిత్రానికి కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. టైటిల్ ఏమో హనుమంతుడిని గుర్తు చేసేలా ఉండటంతో సెన్సార్ బోర్డు నో చెప్పింది. దీంతో ఈ సినిమాను 'వనవీర' పేరుతో విడుదల చేయాల్సి వచ్చింది. ప్రమోషన్ల కోసం ఖర్చు పెట్టిన డబ్బు, టైటిల్ రీచ్ అంతా వృథా అయిందని ఆ చిత్ర దర్శకుడు ఆవేదన వ్యక్తం చేశారు.



# ములుగు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా చంద్రకళ

- వైస్ చైర్మన్‌గా ఆసియా షాహిన్
- ప్రమాణ స్వీకారం చేయించిన ఆర్డీవో వెంకటేష్
- హాజరైన మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు మున్సిపాలిటీకి సంబంధించి ఎన్నికల ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా 6వ వార్డు కౌన్సిలర్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్మన్‌గా 14వ వార్డు కౌన్సిలర్ ఆసియా షాహిన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధీకృత అధికారి, ఆర్డీవో ఎన్.వెంకటేష్ ఈ ఎన్నికను పర్యవేక్షించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్ నూతనంగా ఎన్నికైన 20 మంది కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో చంద్రకళ మరియు ఆసియా షాహిన్‌లను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు అధికారులు వారిని విజేతలుగా ప్రకటించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

### హాజరైన మంత్రి సీతక్క..

ఈ చారిత్రాత్మక ఘట్టానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఎక్స్ అఫిషియో మెంబర్‌గా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు ఆమె హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ములుగు పట్టణ అభివృద్ధికి పాలకవర్గం చిత్తశుద్ధితో పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగాలని ఆమె సూచించారు. మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు గంగాధర్ ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షించగా, మున్సిపల్ సిబ్బంది మరియు వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.







# జనగామ చైర్మన్ ఎన్నిక వాయిదా

**వరంగల్ వాయిస్, జనగామ :** శాంతిభద్రతల సమస్య ఉందంటూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళన మేరకు సోమవారం జరగవలసిన జనగామ మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు ఆయా పార్టీల నేతలు ఏర్పాటు చేసిన క్యాంపుల నుంచి సోమవారం ఉదయం 11.30 గంటలకు నేరుగా బస్సుల ద్వారా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎక్స్ అఫీషియో సభ్యులైన భువనగిరి ఎంపీ చా మల కిరణ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి కూడా హాజరయ్యారు. ఈ మేరకు పార్టీల వారీగా ఏర్పాటు చేసిన స్థానాల్లో ఇరు పార్టీలకు చెందిన సభ్యులు ఆశీనులయ్యారు. ఇండిపెండెంట్ గా గెలిచిన నలుగురు సభ్యులకు వేరే ప్రాంతంలో సీటింగ్ ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో మొత్తం 30 వార్డులు ఉండగా బీఆర్ఎస్ పార్టీ 13 వార్డులు గెలుచుకోగా కాంగ్రెస్ పార్టీ 12 ఆ పార్టీ బలపరిచిన సీపీఐఎం ఒక స్థానాన్ని గెల్చుకుంది. ఇండిపెండెంట్లుగా నలుగురు గెలుపొందారు. ఎవరికి సరైన మెజారిటీ లేకపోవడంతో చైర్మన్ ఎంపిక ఉత్కంఠగా మారింది. కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం సజావుగా సాగింది. అనంతరం చైర్మన్ ఎంపికకు ఏర్పాట్లు చేశారు. రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో గోపి రామ్ ఆధ్వర్యంలో చైర్మన్ ఎంపిక మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించేందుకు ముందుకు రాగా, ఎక్స్అఫిషియో సభ్యుడు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చైర్మన్ ఎన్నికను వాయిదా వేయాలని కోరారు. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితులలో చైర్మన్ ఎన్నిక జరపవద్దంటూ ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి వ్యతిరేకించారు. ఆర్డీఓ కూడా ఫోరం మొత్తం ఉన్నందున చైర్మన్ ఎన్నిక నిబంధనల ప్రకారం జరపాల్సిందేనని తేల్చి చెప్పారు. అయినప్పటికీ ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి వినిపించుకోకపోక మొండిపట్టు పట్టారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు 13 మంది ఆర్డీవో పోడియం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. వీరికి మద్దతుగా ఇద్దరు ఇండిపెండెంట్ సైతం ఆందోళనకు మద్దతు తెలుపుతూ బైఠాయించారు. చైర్మన్ ఎన్నిక వాయిదా వేయాలంటూ పెద్ద చెట్టున నినాదాలు చేయడంతో సమావేశ మందిరం దద్దరిల్లిపోయింది. వాయిదా వేసే అంత ఉద్రిక్తత ఏమీ లేదని వాయిదా వేసే ప్రసక్తే లేదని ఆర్డీఓ చెప్పినప్పటికీ వినకపోగా ఆందోళనను ఉధృతం చేశారు. ఆర్డీఓ ఎంత చెప్పినా వినకపోగా ఉన్నతాధికారులకు సమాచారం అందించి ఎన్నిక 24 గంటల పాటు వాయిదా వేయాలంటూ ఎంపీ శ్యామల కిరణ్ కుమార్ రెడ్డి పట్టుపట్టారు. ఆర్డీవో చైర్మన్ ఎన్నికను వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు.



# బీజేపీ ఓట్ల శాతం పెరిగింది

- ఫలితాలపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజల నుంచి మంచి ఆదరణ లభించిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు తెలిపారు. ఈ ఎన్నికల్లో పార్టీ ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందని తెలిపారు. గతంతో పోలిస్తే ఎక్కువ స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం పార్టీ బలోపేతానికి సంకేతమని పేర్కొన్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకు ఇతర పార్టీలు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ, ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారని రామచందర్ రావు అన్నారు. భైంసాలో బీజేపీ విజయం సాధించకుండా చేయాలని చాలా ప్రయత్నాలు జరిగాయని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 15 మున్సిపాలిటీల్లో బీజేపీ గట్టిపోటీ ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ది రాష్ట్రంలో బీజేపీ ప్రభావం పెరుగుతున్నదానికి నిదర్శనమని రామచందర్ రావు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తెలంగాణ బీజేపీకి ఉత్సాహాన్ని నింపాయని రామచందర్ రావు పేర్కొన్నారు.

# అక్షర చిట్ ఫండ్ డైరెక్టర్ శ్రీవిద్య అరెస్ట్

- బెంగళూరు విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అక్షర చిట్ ఫండ్ సంస్థ డైరెక్టర్ పేరాల శ్రీవిద్యను హనుమకొండ జిల్లా సుబేదారి పోలీసులు నిన్న రాత్రి బెంగళూరు విమానాశ్రయంలో అరెస్ట్ చేశారు. జడ్జి ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అక్షర చిట్ ఫండ్ సంస్థలో చిట్టీలు వేసిన వందలాది మంది భాదితులకు చిట్టీ గడువు ముగిసిన కూడా యాజమాన్యం డబ్బులు ఇవ్వకుండా మోసం చేయడంతో చాలా మంది బాధితులు సుబేదారి పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. చిట్ ఫండ్ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రావుపై పలు కేసులు నమోదు చేసి, రెండు సార్లు జైలుకు కూడా పంపించారు. మరో రెండు కేసుల్లో శ్రీనివాసరావు, ఆయన భార్య శ్రీవిద్య నిందితులుగా ఉన్నారు. పోలీసులకు చిక్కకుండా తప్పించుకొని తిరుగుతున్నారు. శ్రీవిద్య అమెరికా నుంచి వస్తుండగా బెంగుళూరు ఎయిర్ పోర్ట్ లో అరెస్ట్ చేసి, హనుమకొండ జిల్లా జడ్జి ముందు హాజరుపరిచి నర్సంపేట జైలుకు తరలించునట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ రంజిత్ తెలిపారు.



# ప్రజావాణికి 65 ఫిర్యాదులు

- ప్రత్యేక దృష్టి సారించాలి
- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజావాణి దరఖాస్తుల సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. వాటి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదులు వివరాలు టౌన్ ప్లానింగ్ విభాగినికి చెందినవి 33, ఇంజనీరింగ్ విభాగినికి చెందినవి 22, రెవెన్యూ విభాగినికి చెందినవి నాలుగు, హెల్త్ & శానిటేషన్ విభాగినికి చెందినవి రెండు, నీటి సరఫరా విభాగినికి చెందినవి నాలుగు మొత్తం మొత్తం 65 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, సీహెచ్ఓ రమేష్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లాలో చైర్మన్లు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 మున్సిపాలిటీలలో వివిధ కారణాలతో జనగామ, తొర్రూరు, డోర్నకల్ మున్సిపాలిల చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎన్నికను రేపటికి వాయిదా వేశారు. మిగిలిన మున్సిపాలిటీల చైర్మన్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పరకాల చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ (కాంగ్రెస్), వైస్ చైర్మన్ ఏకు దివ్య (కాంగ్రెస్), ములుగు చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్ర కళ (కాంగ్రెస్), వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, వర్ధన్నపేట చైర్మన్ పాలకుర్తి సారంగపాణి (కాంగ్రెస్), వైస్ చైర్మన్ నేతావత్ శిభా రాణి (ఇండి), నర్సంపేట చైర్మన్ పెండెం శ్రీ లక్ష్మి (కాంగ్రెస్), వైస్ చైర్మన్ గందం నరేందర్ (కాంగ్రెస్), మరిపెడ చైర్ పర్సన్ గా వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి (కాంగ్రెస్), భూపాలపల్లి చైర్మన్ గా బుర్ర కొమురయ్య (కాంగ్రెస్), మహబూబాబాద్ చైర్మన్ గా గుగులోతు జ్యోతి (కాంగ్రెస్), స్టేషన్ ఘనపూర్ చైర్మన్ గా తాటికొండ వినయ్ కుమార్, కేసముద్రం చైర్మన్ గా బానోత్ సునీత (కాంగ్రెస్) ఎన్నికయ్యారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com